ఐఎబి ఎప్పుడో..?

ఆయకట్టు రైతుల్లో అయోమయం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు (ఐఎబి) సమావేశం ఎప్పుడన్న దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. ఒకవైపు జిల్లాకు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, హంద్రీనీవా రెండింటి నుంచి నీళ్లు చాలాకాలంగానే వస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ కూడా ఆరంభమై రైతులు పంటల వేసుకునే పనుల్లోనున్నారు. అయితే ఆ ప్రాంతంలో ఎప్పుడు నీళ్లు ఇస్తారన్న దానిపై ఇప్పటికీ స్పష్టతలేదు. అది రావాలంటే ఐఎబి సమావేశం కీలకంగా జరగాల్సి ఉంటుంది. ఈ సమావేశంలో అనంతపురం జిల్లాతోపాటు, సత్యసాయి, కడప, కర్నూలు జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిదులు కూడా పాల్గొనాల్సి ఉంటుంది. ఆ సమావేశంలో ఏ ప్రాంతానికి ఎప్పుడు నీళ్లు ఇవ్వాలి. ఏమేరకు కేటాయింపులు జరపాలన్నది నిర్ణయం చేయాల్సి ఉంది.

ప్రధానంగా హెచ్ఎల్‌సి పరిధిలో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్, గుత్తి సబ్ బ్రాంచ్ కెనాల్, మధ్యపెన్నార్ ఉత్తర, దక్షిణ కాలువలు, తాడిపత్రి బ్రాంచ్‌కెనాల్, పులివెందుల బ్రాంచ్ కెనాల్, పిఎబిఆర్ కుడికాలువ కిందనున్న కాలువలకు నీరు విడుదల చేయాల్సి ఉంది. దామాషా పద్ధతిలో తుంగభద్ర నుంచి నీటి లభ్యత ఆధారంగా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరు కేటాయిస్తారు. ఆ దామాషాలోనే ఈ కాలువలకు నీటి కేటాయింపులు జరిపి తేదీలను ముందస్తుగా ప్రకటించాలి. ఈసారి తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరు ముందుగానే వచ్చింది. దీంతో ఎగువ ప్రదాన కాలువకు నీటిని ముందస్తుగా విడుదల చేసుకునే అవకాశమున్నా మరమ్మతుల కారణంగా కొంత ఆలస్యంగా నీటిని తీసుకోవడం జరిగింది. జిల్లాకు ప్రస్తుతం 1862 క్యూసెక్కు లనీరు వస్తోంది. ఇందులో నుంచి ఇప్పటికే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్‌కు నీటిని అధికారులు విడుదల చేశారు. దిగువనున్న మిడ్‌పెన్నార్ ఉత్తర, దక్షిణ కాలువలకు ఎప్పుడు నీరు విడుదల చేస్తారన్నది తెలియదు. దీంతో ఆ ప్రాంతంలో రైతులు పంటల సాగు ఎలాగన్నది అయోమయంగా ఉంది. డ్యామ్‌లో గతంలోలాగా పూర్తి సామర్థ్యంతో ఈసారి నిలువ ఉంచడానికి వీల్లేనందున నీటి లభ్యత గతేడాది అంత ఉండకపోవచ్చునని అధికారులు చెబుతున్నారు. ఇటువంటి తరుణంలో ఆయకట్టు రైతులకు మరింత స్పష్టతను ముందస్తుగా ఇవ్వాల్సి ఉంటుంది. రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ఈ నిర్ణయాలు చేయడంలోనూ జాప్యం జరుగుతోందన్న చర్చ నడుస్తోంది.

హంద్రీనీవాకు లెక్కల్లేవు..

హంద్రీనీవాకు ఈసారి ముందస్తుగానే నీరొస్తోంది. ఈసారి కాలువ వెడల్పుకు కూడా పెంచడంతో ప్రవాహ సామర్థ్యం పెరిగింది. దీంతో గతం కంటే ఎక్కువ నీళ్లు తీసుకునే వెసలుబాటుంది. అయితే ఈ నీటిని వాడకం విషయంలో ఎక్కడా సరైన లెక్కల్లేవు. ఎందుకంటే ఇప్పటి వరకు అటువంటి కేటాయింపులు అధికారికంగా లేవు. దీంతో అధికారులు, నేతల ఒత్తిడి మేరకు ఎక్కడ బడితే అక్కడ వాడేస్తున్నరన్న విమర్శ ఉంది. కనీసం ఈసారి అయినా ఐఎబిలో ఈ నీటి వాడకంపై లెక్కలు తేలుస్తారా లేక ఎప్పటిలాగా బలాన్ని బట్టి నీటిని తీసుకెళుతారోనన్నది చూడాల్సి ఉంది.

హామీలు విస్మరించి బాదుడా..?



అనంతపురం విద్యుత్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న వామపక్ష ప్రజాసంఘాల నాయకులు

- ◆ జనంపై విద్యుత్ భారాలు దుర్మార్గం
- ◆ ఎన్నికల ముందు ఏమి చెప్పారో గుర్తులేదా..?
- ◆ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణం ఆపాలి
- ◆ విద్యుత్ ఛార్జీలభారంతో జనం అవస్థలు
- ◆ ప్రభుత్వం స్పందించకుంటే తిరుగుబాటు తప్పదు
- ◆ వామపక్ష, ప్రజాసంఘాల నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ట్రూఅప్ ఛార్జీల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగదారులు, ప్రజలపై మోయలేని భారం మోపుతున్నాయని, తక్షణం వీటిని ఆపాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ట్రూ ఆఫ్ చార్జీలు ఉప సంహరించాలని కోరుతూ వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భారాల పాలనను నాయకులు ఎండగట్టారు. అనంతపురం పాతూరు విద్యుత్ కార్యాలయం ఎదుట సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, సిపిఐ, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు సి.నాగరాజు, సిపిఐఎంఎల్ జిల్లా నాయకులు చంద్రశేఖర్, ఎస్‌యుసిఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.నాగేంద్ర కుమార్, వై.రాజారెడ్డి హాజరై మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం 9 సార్లు కరెంటు ఛార్జీలు పెంచి, రూ.32 వేల కోట్లు భారం వేసిందన్నారు. బాదుడు ఉండదని చెప్పి టిడిపి, బిజెపి, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాయన్నారు. ఛార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చి వాటిని విస్మరించారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు పగల కొట్టండని లోకేష్ కూటమి నేతలు పిలుపునిచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం మాట తప్పి నమ్మకద్రోహం చేస్తోందన్నారు. సంవత్సర కాలంలో కరెంట్ బిల్లులు పెరిగిపోయి జనం గగ్గోలు పెడుతున్నా, ఛార్జీలు పెంచలేదంటూ మోసగిస్తున్నారని విమర్శించారు. ఏ వస్తువుకీ, సర్వీసుకు లేని విధంగా వాడుకున్న ఐదేళ్ల తరువాత కూడా లోటు వచ్చిందనే పేరుతో ట్రూఆఫ్ సర్దుబాటు ఛార్జీలు (ఎఫ్పిపిసిఎ) జనం నుంచి వసూలు చేసే విధానాన్ని సంస్కరణలలో భాగంగా టిడిపి ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిందన్నారు. అక్రమ ఒప్పందాలు, అవినీతి చర్యలతో ఖర్చులు పెంచి ప్రజల నుంచి సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయడం అన్యాయంగా ఉందన్నారు. సెల్ ఫోన్ తరహాలో ముందుగానే డబ్బు చెల్లించి కరెంటు కూడా రీఛార్జ్ చేయించుకునే దుస్థితిని పాలకులు కల్పిస్తున్నారని తెలిపారు. ఈ పద్ధతి వల్ల బడా కంపెనీలు దేశంలో రూ.23 లక్షల కోట్లు అడ్వాన్స్ రూపంలో జనం నుంచి గుంజుతారని తెలిపారు. ఈ మీటర్ ఖర్చు సింగిల్ ఫేస్‌కు రూ.9 వేలు, త్రీఫేస్ రూ.17 వేలు, 93 నెలల్లో వాయిదాల పద్ధతిలో జనం నుంచే వసూలు చేస్తారని, ఇక గంట గంటకి రీడింగ్ తీస్తారని తెలిపారు. పగలు కంటే రాత్రి వాడే కరెంటుకు అధిక బిల్లులు వేస్తారన్నారు. ఈ భారాలు పడకుండా ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యుత్ విధానాలు ఉప సంహరించుకోవాలన్నారు. అదాని స్మార్ట్ మీటర్లు ఆపాలన్నారు. పెట్టిన మీటర్లు తొలగించాలన్నారు. ట్రూఅప్, ఇంధన సర్దుబాటు (ఎఫ్‌ఎపిపిసి) చార్జీల విధానాన్ని పూర్తిగా తొలగించాలన్నారు. అదనపు భారాలు తగ్గించాలన్నారు. ఇప్పటి వరకు వసూలు చేసిన సర్దుబాటు ఛార్జీలను ప్రజలకు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు వెంకటనారాయణ, నగర నాయకులు గోపాల్, ఏటీఎం నాగరాజు, తిరుమలేశు, వరలక్ష్మి సిపిఎం నగర కమిటీ సభ్యులు ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్, ఆవాజ్ వలి, సిపిఐ నగర సహాయ కార్యదర్శి రమణయ్య, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

మిగతా 6లో

కూటమి పాలనలో వాతలు..కోతలే..: ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

కూటమి పాలనలో ప్రతి పథకంలో కోతలు, వాతలు తప్ప.. పూర్తిస్థాయిలో అమలు చేసిన పాపాన పోలేదని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ముఖ్యంగా వ్యవసాయం కుదేలైందన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించారన్నారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. పెట్టుబడి సాయం కింద సంవత్సరానికి రూ.20వేలు ఇస్తామని, అది కూడా జూన్ 2024 నుంచే అమలు చేస్తామని ఎన్నికల ముందు చెప్పారన్నారు. ఈరెండేళ్లకు కలిపి ప్రతి రైతుకూ రూ.40వేలు ఇవ్వాల్సి ఉందన్నారు. దీనికితోడు ఏడు లక్షల మందికి ఈ పథకంలో కోతలు పెట్టారన్నారు. వీటితోపాటు గిట్టుబాటు ధర దొరకడంలేదు. ధరల స్థిరీకరణ నిధిని ఎత్తివేసి రైతులను కష్టాలపాలు చేశారన్నారు. ఉచిత పంటల బీమాను రద్దు చేశారని, సున్నా వడ్డీని నీరుగార్చారన్నారు. ఎరువుల కోసం చాలా ఏళ్ల తర్వాత రైతులు క్యూలో నిలబడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఈ పరిస్థితులను ప్రయివేటు వ్యాపారులు ఆసరా చేసుకుని దోపిడీ చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సచివాలయ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

రాయదుర్గం : పట్టణ పొలిమేరలోని బైపాస్ రోడ్డు వద్ద రైల్వేట్రాక్ సమీపంలో సచివాలయ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాయదుర్గం మండలం పల్లేపల్లి గ్రామంలోని సచివాలయంలో పని చేసే వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు కుటుంబ సభ్యులకు సెల్‌ఫోన్ ద్వారా మెసేజ్ చేసి రైలు పట్టాల సమీపంలో టమోటా పంటకు ఉపయోగించే క్రిమిసంహారక మందు తాగాడు. ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో మల్లికార్జున కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఎస్పీ జగదీష్ ఆదేశాలతో స్థానిక పోలీస్ ఇన్స్‌పెక్టర్ జయనాయక్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మల్లికార్జున ఉన్న ప్రాంతాన్ని గుర్తించి వెళ్లారు. అయితే అప్పటికే అపస్మార స్థితికి చేరుకున్న మల్లికార్జునను గమణించి రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

'కూటమి' మోసాలపై అవగాహన

ప్రజాశక్తి-నార్పల

ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పప్పూరు, బొందలవాడ, బొమ్మకుంటపల్లి గ్రామాల్లో వైసిపి మండల కన్వీనర్ ఖదర్ వలిఖాన్ ఆధ్వర్యంలో 'ఇంటింటికీ చంద్రబాబు మోసం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా చంద్రబాబు మేనిఫెస్టోను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వేదాంతం నాగరత్నమ్మ, నాగేశ్వరావు, శంకర్‌యాదవ్, రాజారెడ్డి, బొందలవాడ రంగయ్య, రామాంజనేయులు, శ్రీరాములు, బయపురెడ్డి, నారాయణరెడ్డి, పక్కిరెడ్డి, శివారెడ్డి, పాపయ్య, యలప్పనాయుడు, పోలయ్య, లక్ష్మీరెడ్డి, నాగలింగారెడ్డి, వెంకటేష్, సూర్యనారాయణ, మన్నీల శివయ్య, దాడితోట బాసా, బాలనాగి బయన్న, అమీర్‌బాషా, గుత్తి గోపాల్‌రెడ్డి, బాలనాగి రామాంజనేయులు, రాముడు, జిలాన్‌బాషా, భాస్కర్‌నాయుడు, ముచ్చుకుంటపల్లి వెంకట నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండల పరిధిలోని ఆకులేడు, రఘునాథపురం, మదిరేపల్లి, లోలూరు గ్రామాల్లో 'బాబు షూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పూల ప్రసాద్, నాయకులు తరిమెల గోకుల్‌రెడ్డి, ఎం.వీరాంజనేయులు, భాస్కర్‌రెడ్డి, రవీంద్ర, మురార్జీ, చాగంటి గురుమూర్తిరెడ్డి, రామాంజనేయులు, నల్లపరెడ్డి, నూరుమహమ్మద్, బంగారు అలిబాషా, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం

పొంగిన వాగులు, వంకలు-జలమయమైన వీధులు



బెలుగుప్ప మండలంలో కూలిన ఇల్లు

ప్రజాశక్తి-బెలుగుప్ప

బెలుగుప్ప మండలంలో సోమవారం రాత్రి అతిభారీ వర్షం కురిసింది. జిల్లాలోనే బెలుగుప్ప మండలంలో 90.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షం కురవడంతో, చెరువులు వాగులు, వంకలు పొంగి పొర్లాయి. బెలుగుప్ప వంక పారింది. నాగుల చెరువు 80 శాతం నిండింది, కొన్నిపొలాలు, మొక్కజొన్న పంట నీటి మునగాయి. దాదాపు నెల నుంచి వర్షం లేకపోవడంతో రైతులు ఆకాశం వైపు చూసే సమయంలో వర్షం కురవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఇకపోతే ఎస్సీ కాలనీకి చెందిన సువర్ణమ్మ, మల్లి చెందిన మట్టిమిది సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి నేలకూలింది. అయితే పెద్దఎత్తున శబ్ధం రాగానే సువర్ణమ్మ బయటికి వచ్చింది. దీంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఇల్లు నేలకూలడంతో బీరువా, దుస్తులు, తిండి గింజలు, రూ.50వేల నగదు నష్టపోయామని బాధితులు వాపోయారు.

బొమ్మనహాల్‌లో..

బొమ్మనహాల్ : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మంగళవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. దాదాపు 11 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు తహశీల్దార్ మునివేలు తెలిపారు. దీంతో పలు కాలనీలు వర్షం నీట మునిగాయి. ముఖ్యంగా మండల కేంద్రంలోని ఎన్‌టిఆర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, గోవిందవాడ, బళ్లనగుడ్డం, వైఎస్ఆర్ శ్రీధర్‌ఘట్ట ఎస్సీ కాలనీ, ఎలంజి ఎస్సీ కాలనీ, గోనేహాల్, కురవల్లి, సిద్ధరాంపురం, తదితర ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.




పరుగులు తీస్తున్న బెలుగుప్ప మండలంలోని బండూరు వంక

పరుగులు తీస్తున్న బండూరు వంక

మండల పరిధిలోని బండూరు వంక పొంగి పొరుతోంది. వరద నీరు రావడంతో పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉద్దేహాళ్ దేవగిరి క్రాస్ వద్ద ఉధృతంగా ప్రవహించింది. మరోవైపు పత్తి పంట వర్షం నీటిలో మునిగిపోయింది. కాగా రెండు మాసాల నుంచి వర్షం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షంతో వరి నాట్లు వేసుకునేందుకు అనువుగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నార్పలలో...

నార్పల : మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు గంటసేపు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో రోడ్లు వంకలను తలపించాయి. మండల కేంద్రంతోపాటు కురుగానపల్లి, కేశేపల్లి, నడిమిదొడ్డి, తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.



నార్పలలో జలమయమైన వీధులు



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

అభివృద్ధి పనులు పూర్తి చేయాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలోని కాలనీల్లో ఆగిన రోడ్లు, కాలువలు, నీటి సరఫరా తదితర అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, రాజీవ్ కాలనీ ఉప సర్పంచ్ మసూద్ డిమాండ్ చేశారు. మంగళవారం రాజీవ్ కాలనీ పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రావుని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలో వివిద కారణాలతో పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయని తెలిపారు. కాలువలు, రోడ్లు వంటివి సగంలోనే ఆగిపోయాయని తెలిపారు. డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తొలగించాలని కోరారు. జనాభాకు తగినట్లుగా పారిశుద్య కార్మికులను నియమించాలన్నారు. గ్రామ జనాభాకు అనుగుణంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డేవిడ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

5జి నెట్‌వర్క్ ట్యాబ్‌లు అందించాలి

అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-అనంతపురం

అంగన్వాడీ కేంద్రాలకు 5జి నెట్‌వర్క్ ట్యాబ్‌లను అందించాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ పిలుపులో భాగంగా ప్రాజెక్ట్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.నాగేంద్రకుమార్ అధ్యక్షతన మంగళవారం అనంతపురం అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని సిడిపిఒ కార్యాలయంలో అంగన్వాడీలకు సంబంధించిన సెల్‌ఫోన్‌లు, సిమ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు సక్రమంగా పని చేయడం లేదన్నారు. దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సెల్‌ఫోన్లు మార్చాలని ఇప్పటికే ప్రభుత్వానికి పదేపదే చెబుతున్నా స్పందించడం లేదన్నారు. చేసేది లేక తిరిగి కార్యాలయాల్లో అందజేస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీలకు 5జి ట్యాబ్‌లను అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకురాలు హరిప్రియ, సంధ్య, సుభాషిని, తదితరులు పాల్గొన్నారు.



వెనక్కి ఇస్తున్నన సెల్‌ఫోన్‌లను చూపుతున్న అంగన్వాడీలు

ప్రజలు లేనిచోటుకు బయోమైనింగ్ వ్యర్థాలను తరలించండి

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగర ప్రజలకు ఇబ్బంది లేనిచోటుకు బయోమైనింగ్ వ్యర్థాలను తరలించాలని మేయర్ మహమ్మద్ వసీం సంబంధిత అధికారులను ఆదేశించారు. డంపింగ్ యార్డులో జరుగుతున్న బయోమైనింగ్‌లో వెలువడుతున్న వ్యర్థాలను నగరంలోని ఎస్ఎస్ ట్యాంక్‌లోకి తరలిస్తుండటంతో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మేయర్ మహమ్మద్ వసీం అధికారులు, సంభందిత కాంట్రాక్టర్, నాయకులు, స్థానికులతో కలిసి మంగళవారం ఎస్ఎస్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందిని మేయర్ ఆరాతీయగా తమకు తెలియదని చెప్పడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ గతంలో నగరానికి మంచినీరు అందించిన ఎస్ఎస్ స్టోరేజ్ ట్యాంక్‌లో బయోమైనింగ్ వ్యర్థాలను వేయడం మంచిది కాదన్నారు. చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలకు ఇబ్బందిగా మారే అవకాశం ఉంటుందన్నారు. అంతేకాకుండా ఎస్ఎస్ స్టోరేజ్ ట్యాంక్‌ను వినియోగంలోకి తెచ్చి పాతూరు ప్రాంతానికి మంచినీటి సరఫరా చేయాలని ఇప్పటికే నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించడంతోపాటు ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. ఈసమయంలో బయోమైనింగ్ వ్యర్థాలను ట్యాంకులో వేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా స్పందించి బయో వ్యర్థాలను వేరేచోటుకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ రాజశేఖర్, డిఇ సత్యనారాయణ, వైసిపి నాయకులు గంగాధర్, లక్ష్మన్న, దాదాఖలందర్, కాకర్ల శీనా, స్థానికులు రఫీ, సిరాజుద్దీన్, రాజశేఖర్, ప్రకాష్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, ఆనంద్, చందూ, బాషా మార్కెట్, బాలాచారి, ముత్యాలురెడ్డి, మసూద్, తదితరులు పాల్గొన్నారు.



బయో మైనింగ్ వ్యర్థాలను పరిశీలిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం, అధికారులు

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రధాన కార్యదర్శిగా ఓతురు పరమేష్, జిల్లా అధ్యక్షునిగా తరిమెల గిరి

ప్రజాశక్తి-శింగనమల

శింగనమలలో నిర్వహించిన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 33వ ప్లీనరీలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నానరు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఓతూరు పరమేష్ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా జిల్లా అధ్యక్షునిగా తరిమెల గిరిని ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా వైటిసి రమేష్, బంగి శివ, వంశీ, సహాయ కార్యదర్శిగా రాచేపల్లి సూర్య ప్రకాష్, వెంకీ, భీమేష్, వంశీ, శివ, నవీన్, అరుణ్ రషీద్‌తోపాటు 12 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాల వేదికగా ఉద్యమ కార్యాచరణను ఆమోదం తెలిపినట్లు వివరించారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా సమస్యలు బయట ప్రపంచానికి తెలియకుండా నొక్కిపెట్టే జీవోను తక్షణమే రద్దు చేసేంత వరకూ ఉద్యమిస్తామన్నారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని రానున్న రోజుల్లో ఉద్యమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు సాయి, వీరు, విజయ్, నవీన్, ప్రవీణ్, వినీల్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాల్సిందే..

సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలి-వామపక్షాల ఆధ్వర్యంలో నిరసనలు, వినతులు



విద్యుత్ శాఖ డిఇ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- కళ్యాణదుర్గం టౌన్

స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని, విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించాలని, సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని సిపిఎం రాయలసీమ సబ్‌కమిటీ కన్వీనర్ ఓబులు డిమాండ్ చేశారు. సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ శాఖ డిఇ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం డిఇ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మోపుతోందన్నారు. ఇళ్లలో అదానీ విద్యుత్ స్మార్టుమీటర్లను బిగించి ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పేరుతో ఏడాదిలో రూ.15485 కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. తిరిగి ఇప్పుడు రూ.12700 కోట్ల భారాన్ని మోపేందుకు సిద్ధమైందన్నారు. వెంటనే విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవడంతోపాటు విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ రానున్న రోజుల్లో ఆందోలనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. మోడీ ప్రభుత్వం ఆదేశాలకు లొంగిపోయి గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపు ఒప్పందాలు చేసుకుని అదానీ సంస్థకు టెండర్లను కట్టబెట్టి భారీ కుంభకోణానికి పాల్పడిందని ఆరోపించారు. అందుకే గత ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించారనే విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించుకోవాలన్నారు. నాడు 'స్మార్ట్‌మీటర్లను పగలగొట్టండి' అని పిలుపునిచ్చిన మంత్రి లోకేష్ అధికారంలోకి వచ్చాక అదే స్మార్ట్ మీటర్లను బిగించాలని ఆదేశాలు ఇవ్వడం బాధాకరమన్నారు. ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు బిగించడాన్ని ఆపాలని, పాత మీటర్లనే కొనసాగిస్తూ పాత రీడింగ్ పద్ధతినే అమలు చేయాలని, వ్యాపార సంస్థలకు పెట్టిన మీటర్లను తొలగించాలని, సర్దుబాటు ఛార్జీలు పూర్తిగా రద్దు చేసి బిల్లులు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్చుత్‌ప్రసాద్, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిహెచ్ రాయుడు, సిపిఎం మండల అధ్యక్షుడు రంగనాథ్, సిఐటియు నాయకులు వన్నూరుస్వామి, నరేష్, నాగరాజు, అనీల్, వన్నూరప్ప, తిప్పేరుద్ర, నాగన్న, ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ నాయకులు భవిత్, పరమేష్, తిప్పేస్వాములు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : ఇళ్లకు బిగిస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు తొలగించాలని, విద్యుత్ భారాలు ఉప సంహరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య, సిపిఎం అనంతపురం రూరల్ ప్రాంతీయ కార్యదర్శి టి.రామాంజినేయులు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇటుకలపల్లి సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిలో దోపిడీకి ఆస్కారం కలిగించే విధంగా ఆదానీ విద్యుత్ స్మార్టు మీటర్లను బిగించి ప్రజలపై భారం మోపుతున్నారని తెలిపారు. తక్షణమే విద్యుత్ విధానాలు ఉప సంహరించుకోవాలని కోరారు. అనంతరం సబ్‌స్టేషన్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాప్తాడు రూరల్ ప్రాంతీయ కమిటీ సభ్యులు ఎం.పోతలయ్య, సిఐటియు మండల కన్వీనర్ బ్రహ్మయ్య, నాయకులు మల్లేష్, ప్రకాష్, శివకుమార్, నారాయణస్వామి, మధు, బాలకష్ణ, నాగేంద్ర, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని, విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించాలని, సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక ఆలూరు రోడ్డులోని విద్యుత్ శాఖ డిఎఇ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్, సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, కార్యదర్శివర్గ సభ్యులు సురేంద్రబాబు, పట్టణ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, షబ్బీర్, అబ్దుల్లా, ఓబులేసు, సూరి, సిపిఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మండల కార్యదర్శి రాముడురాయల్, నాయకులు కుళ్లాయప్ప, రామాంజనేయులు, దౌలా, నూర్‌బాషా, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు బాషా, జిలాన్, సత్తార్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన స్మార్ట్‌మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విద్యుత్ అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్లకు స్మార్ట్‌మీటర్ల బిగింపును ప్రజలు వ్యతిరేకించాలన్నారు. అలాగే పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు సూర్యచంద్ర, బాలరాజు, కొండారెడ్డి, శ్రీనివాసులు, సూర్యప్రకాష్, సుంకన్న, ఎర్రిస్వామి, రామాంజనేయులు, కుళ్లాయిస్వామి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : ఇళ్లకు స్మార్ట్‌మీటర్ల బిగింపు, విద్యుత్ ఛార్జీల పెంపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం విద్యుత్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సూరి, సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య, నాయకులుచ రాజు, బాలు, టి.పెద్దయ్య, పెద్దన్న, భూషణం, సురేంద్ర, నడిపి నారాయణ, కె.చిన్నారెడ్డి, పెద్దయ్య, వి.కుళ్లాయప్ప, బాల ఓబులేసు, దేవరాజు, బి.భాస్కర్‌రెడ్డి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగింపు ఉపసంహరించుకోవడంతోపాటు పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు సాకే గంగాధర్, నాయకులు సుధాకర్, నవీన్, పెద్ద పెద్దయ్య, నారాయణప్ప, పెద్దక్క, నరసింహా, పవన్, సుందరమ్మ, రవి, చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : ఇళ్లకు స్మార్ట్‌మీటర్ల బిగింపు, విద్యుత్ ఛార్జీల పెంపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు కార్యదర్శి చింతా పురుషోత్తం, తలారి రామకృష్ణ, కాశీ నారాయణస్వామి, రాఘవ, తలారి రంగ, కురువ నారాయణ, రాముడు, గుర్రం మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు బిగించడానికి ఉపసంహరించుకోవాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రంగారెడ్డి డిమాండ్ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం విద్యుత్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మురళి, వీరాంజనేయులు, రామాంజనేయులు, రామాంజనేయులు నాయక్, సిద్ధప్ప, సీనప్ప, సూర్యనారాయణ, కౌలు రైతుసంఘం నియోజకవర్గ కార్యదర్శి వెంకటేశు లు, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో లైన్ ఇన్స్‌పెక్టర్ లోక్‌పాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి విరూపాక్షి, భారత సేవారత్న జాతీయ అవార్డు గ్రహీత, జెవివి జిల్లా కార్యదర్శి ఎంపీ మల్లికార్జున, సిఐటియు సుధాకర్, భీమన్న, నబిరసూల్, హమాలీ సుధాకర్, రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : అదానీకి లాభాలు చేకూర్చేందుకు ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం దుర్మార్గమని వామపక్షాల నాయకులు విమర్శించారు. స్మార్ట్ మీటర్ల బిగింపును రద్దు చేయాలని, సర్దుబాటు ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విద్యుత్ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సంజీవప్ప, సిపిఎం నాయకులు నాగరాజు, మధు, తిమ్మరాజు, శివ, కృష్ణానాయక్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున, కోట్రేష్, రవి, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం విద్యుత్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బషీర్ అహ్మద్, సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ, వామపక్షాల నాయకులు వెంకట్‌రాముడు యాదవ్, వడ్డే రాముడు, ఓబిరెడ్డి, గరిడి శివన్న, నబిరసూల్, కుళ్లాయిరెడ్డి, బండారు రాఘవ, కేశవరాయునిపేట రామసుబ్బారెడ్డి, మోహన్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



ఇటుకలపల్లిలో వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

పామిడి : స్మార్ట్ మీటర్ల బిగింపును విరమించుకోవాలని స్థానిక సిపిఎం కార్యాలయం నుంచి విద్యుత్తు కార్యాలయం వరకూ వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు రహీం, వామపక్ష నాయకులు మల్లేష్, నాగరాజు, దస్తగిరి, కుమార్ ముత్యాలు, నరసింహులు, సబిరా, శ్రీకాంత్, ఓబులయ్య, చౌడప్ప, వలి, ఇమాములు, కోదండ, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : స్మార్ట్ మీటర్ల బిగింపును నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక విద్యుత్ డిఇ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం డిఇ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, సహాయ కార్యదర్శి నరసింహులు, నాయకులు నాగరాజు నాయక్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతు, కార్యకర్తలు లక్ష్మదేవి, సల్లావుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : బుక్కరాయసముద్రం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, నియోజకవర్గ కార్యదర్శి టి.నారాయణస్వామి, నాయకులు బండి రామకృష్ణ, బండారు రామాంజనేయులు, కె.ఆనంద్, నాయకులు రైతు సంఘం మండల కార్యదర్శి వెంకట రాముడు, రాము, సుంకన్న, భాస్కర్, రామాంజనేయులు, దండువారిపల్లి భాస్కర్, శ్రీనివాస్ పెద్ద తిరుపతయ్య, సర్దార్, మహిళా సమైక్య నాయకురాలు లక్ష్మీదేవి, శివమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం లైన్ ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్, ఎన్ పిఆర్‌డి జిల్లా కార్యదర్శి రామయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి, జయమ్మ, రాము, చెన్నప్ప, మహేష్, వెంకటమ్మ, సువర్ణమ్మ, సత్యసాయి కార్మికులు సుంకన్న, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు బి.గోపీకృష్ణ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.గోపికృష్ణ, ఎస్.రాము నాయక్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్యనారాయణ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ క్యాంటిన్ వద్ద బైటాయించి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన నాలుగు డిఏలు ఇవ్వాలన్నారు. పిఆర్‌సి కమిటీని నియమించాలన్నారు. ఐఆర్ మధ్యంతర భతి కల్పించాలని కోరారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక వివిధ వర్గాల నుంచి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కార దిశగా ప్రభుత్వానికి విన్నవిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిజిఈఏ నగర అధ్యక్షులు మహమ్మద్ రఫీ, రాష్ట్ర కార్యదర్శి బి.సాంబశివమ్మ, హనుమంతు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగరాజు, చంద్రశేఖర్, నగర ఉపాధ్యక్షులు ఆయుష్ సుధాకర్, శ్రీనివాసులు, శ్రీనివాసులు, పాల్, నగేష్, నాగార్జున, శ్రీనివాసులు, ఈశ్వరయ్య, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన నేమకల్లు

బొమ్మనహాల్ : శ్రావణమాసం మంగళవారాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని నెమకల్లులో వెలసిన ఆంజనేయస్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు రావడంతో స్వామి దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. ఈ సందర్భంగా స్వామివారి ప్రత్యేక కుంకుమార్చనలు, వెండి కవచం సువర్ణ కిరీటం అలంకరణతోపాటు ప్రత్యేక పూజలు చేశారు.

పట్టణ ఆరోగ్య కేంద్రం తనిఖీ

అనంతపురం : అనంతపురంలోని 2వరోడ్డులో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఇబి దేవి మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆషా డే, ఆశా యాప్, ఇహెచ్‌ఆర్, ల్యాబ్ టెస్టులు, ఫార్మసీ విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ఆరోగ్యం కేంద్రానికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ కావ్యచౌదరి, ఆరోగ్యకేంద్రం సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోండి

బ్రహ్మసముద్రం : మండలంలో పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పకుండా నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి గోపాల్ సూచించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పంటలను ఈక్రాప్ బుకింగ్ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు.

అమ్మపాలు అమృతంతో సమానం

ప్రజాశక్తి-గుంతకల్లు

అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతంలా పని చేస్తామని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జె.పద్మావతి సూచించారు. మంగళవారం స్థానిక ఎస్జేపి ఉన్నత పాఠశాల సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మపాలు అమృతం కన్నా విలువైనవి అన్నారు. తల్లిపాలు బిడ్డ మెదడు అభివృద్ధితోపాటు రోగ నిరోధక శక్తి పెంచడానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. తల్లులు బిడ్డకు ఆరునెలలు వచ్చేంత వరకూ తల్లిపాలు మాత్రమే పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త లక్ష్మీదేవి, తల్లులు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పద్మావతి

తండాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

నియోజకవర్గంలోని తండాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు మండలంలోని నుసికొట్టాల తండాకు మంగళవారం వచ్చిన ఎమ్మెల్యేకు తండావాసులు తమ సంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని భారీ కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఫ్లోరైడ్ నుంచి విముక్తి కలిగించేందుకు మినరల్ వాటర్ (ఆర్వో) ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు తాను తండాకు వచ్చినప్పుడు రహదారి వేయించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారన్నారు. ఇందుకు తాను గెలిచిన తర్వాత ఐదు కిలోమీటర్లు తారురోడ్డు వేయించామన్నారు. అలాగే రూ.20లక్షలతో విద్యుత్ స్థంబాలను మార్చి నూతన వైర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతిఒక్కరూ సంతోషంగా ఉండాలని ప్రతి కుటుంబానికీ నెలకు సరిపోయేలా నిత్యావసర సరుకులు, ఒక మిక్సీ అందించామన్నారు. అలాగే కళ్యాణదుర్గం 21వ వార్డు అధ్యక్షుడు బేరీలు నాగరాజు, టిడిపి యూత్, మిత్ర బృందం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.



రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

తల్లిపాలు అమృతంతో సమానం

కిమ్స్ సవీరా కన్సల్టెంట్ డాక్టర్ కె.మౌనికారెడ్డి



ప్రజాశక్తి-అనంతపురం సిటీ

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని కిమ్స్ సవీరా ఆసుపత్రి కన్సల్టెంట్ పీడియాట్రిక్స్, నియోనాటాలజిస్టు డాక్టర్ కె.మౌనికారెడ్డి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడుతూ ఎన్నో పోషకాలు ఉన్న తల్లిపాలు పిల్లలను చాలా ఆరోగ్య సమస్యల నుంచి రక్షించవచ్చన్నారు. అయితే గత కొంతకాలంగా తల్లులు పిల్లలకు పాలు ఇవ్వకపోవడం పెరుగుతోంది. అప్పుడే తల్లి అయిన వారిలో దాదాపు 30 శాతం మంది మహిళలు ఏదో ఒక కారణంతో పాలు ఇవ్వడం లేదన్నారు. గత రెండు మూడేళ్లుగా ఇలాంటి మహిళల సంఖ్య వేగంగా పెరిగిందని నిపుణులు చెబుతున్నారన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ తీసుకున్న ఆహారం తేలిగ్గా, సులభంగా జీర్ణం కావడానికి తల్లిపాలే సరైనవి అన్నారు. తల్లిపాల ద్వారా బిడ్డకు కొవ్వులు, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, ప్రోటీన్లు, మిటమిన్లు, మినరల్స్, ఐరన్, మెగ్నీషియం, కాల్షియం అందుతాయన్నారు. అంతేగాకుండా ఎలాంటి హానికరమైన సూక్ష్మక్రిములు ఉండవన్నారు. తల్లిపాలు తాగి పెరిగిన పిల్లల మెదడు చురుగ్గా పని చేస్తుందన్నారు. అలాంటి వారు చదువులో బాగా రాణిస్తారని పలు పరిశోధనల్లో వెల్లడైందన్నారు. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత నాలుగు నుంచి 5 రోజులపాటు తల్లి వృక్షోజాల్లో ఉత్పత్తయ్యే పాలను 'ముర్రు పాలు' అంటారని, అవి పాపాయికి ఎలాంటి అలర్జీ, ఇన్ఫెక్షన్లు సోకకుండా కాపాడతాయి. ఈ పాలు బిడ్డ జీర్ణవ్యవస్థకు ఎలాంటి హాని కలగనీయకుండా చేయడంతోపాటు బిడ్డ వయసుకు తగ్గ బరువు ఉండేలా చూస్తాయన్నారు. ఆరు నెలలు దాటిన తర్వాత కూడా పిల్లలకు ఘనాహారంతో పాటు మధ్యమధ్యలో తల్లిపాలు కూడా ఇవ్వడం మంచిదన్నారు. కనీసం సంవత్సరం వరకైనా తల్లిపాలనుకొనసాగించడం బిడ్డకే కాదు తల్లికి కూడా శ్రేయస్కరం అన్నారు.

అధిక దిగుబడి సాధించాలి

ఎడిఎ జిఎం అల్తాఫ్ అలీఖాన్

ప్రజాశక్తి-అనంతపురం



మాట్లాడుతున్న అనంతపురం ఎడిఎ అల్తాఫ్ అలీఖాన్

వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎ జిఎం అల్తాఫ్ అలీఖాన్ సూచించారు. మంగళవారం అగ్రికల్చర్ టెక్నాలజీ మిషన్ (ఆత్మ) ద్వారా రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంటల యాజమాన్య పద్ధతుల్లో అనేక మార్పులు వచ్చాయన్నారు. ప్రస్తుతం ఉన్న నానో టెక్నాలజీ, డ్రోన్ ద్వారా పురుగు మందులు, ఎరువులు పిచికారి చేసుకోవచ్చన్నారు. తద్వారా ఖర్చు తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం మండల వ్యవసాయ అధికారి వెంకట్‌కుమార్, ఆత్మా విభాగం అనురాధ, ఆలమూరు సర్పంచు సూరి, ఎఇఒ భాగ్య, రైతు సేవాకేంద్రం సిబ్బంది, ఆలమూరు రైతులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కేసీ రంగయ్యశెట్టికి నివాళి

పామిడి : మండల కేంద్రానికి చెందిన శింగనమల నియోజకవర్గ తొలి శాసనసభ్యులు కొత్తూరు చిన్న రంగయ్యశెట్టి వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా ఆయన కుమారులు కెనారాయణమూర్తి, ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో వస్త్రదానం, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కళ్యాణి, రవీంద్ర, రాజేష్, వేదప్రియ, నాగరమ్యత, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల తనిఖీ

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి వెంకటరమణ నాయక్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కళాశాలలోని పలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికీ టెక్స్ బుక్కులు, నోటు పుస్తకాలు అన్ని అందాయా.. అని విచారించారు. తర్వాత కళాశాల అధ్యాపకులతో మాట్లాడుతూ విద్యార్థులకు కరికులం ప్రకారం నిర్ణీత సమయానికి పాఠ్యాంశాలు పూర్తి చేయడంతోపాటు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని తిన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలప్ప, డివిఇఒ సూపరింటెండెంట్ లక్ష్మీరంగయ్య, బాబామైనుద్దీన్, ఖాజాబీ, ఆనంద్‌కుమార్, శివారెడ్డి, మురళి, రవి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలి

ఉరవకొండ : చిన్న పిల్లలకు అన్నిరకాల టీకాలను సకాలంలో వేయించాలని వైద్యాధికారులు తేజస్వి, సర్దార్‌వలి సూచించారు. మంగళవారం వజ్రకరూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో గడపగడపకూ వెళ్లి ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ లక్ష్మీదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, ఎంపిహెచ్ఇఒ గురుప్రసాద్, సూపర్‌వైజర్లు సుశీలమ్మ, నాగశంకర్, హెల్త్ అసిస్టెంట్ సంపత్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

17న 'నా పాట - నీ నోట'

అనంతపురం : నగరంలోని పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతిలో ఈనెల 17వ తేదీన ఆదివారం 'నా పాట – నీ నోట' పేరుతో సినీ సంగీత పాటల పోటీలు నిర్వహించనున్నట్లు ఘంటసాల సంగీత కళాభారతి అధ్యక్షులు సుగుమంచి సురేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే గాయకులు సెల్..99857 62442 నెంబర్‌కు రూ.వెయ్యి ఫోన్‌పే ద్వారా చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అలాగే ఇదే నెంబర్‌కు వాట్సాప్ ద్వారా ప్రతి ఒక్కరు తమ రెండు పాటలను పంపించి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. యువ గాయనీ, గాయకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లాకు చేరిన ఎరువులు

అనంతపురం : వివిధ కంపెనీలకు సంబంధించిన ఎరువులు మంగళవారం జిల్లాలోని ప్రసన్నాయపల్లి రేక్ పాయింట్‌కు చేరినట్లు ఎడిఎ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. ఈమేరకు ఆయా ఎరువులను పరిశీలించి జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ ప్రయేట్ డీలర్లకు కేటాయించినట్లు వివరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

యాడికి : వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి చిగురుపాటి శ్రీనివాసులు సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరమేష్, డాక్టర్ సాయి సుమంత్ రెడ్డి అధ్యక్షతన ఆశాడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేయాలన్నారు ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జుబేదా, మేల్ సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఫిమేల్ సూపర్‌వైజర్ శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలపై అవగాహన


పామిడి : పామిడి మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో 'వాట్సప్ గవర్నెన్స్'పై మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిడిఒ తేజోష్ణ, డిప్యూటీ ఎంపిడిఒ అశ్వర్థనాయుడు, సచివాలయాల సిబ్బంది, ప్రజలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేసుకోండి

రాయదుర్గం : పట్టణంలోని అక్రమ లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణపై మున్సిపల్ కమిషనర్ విదివాకర్‌రెడ్డి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రణాళికా శాఖ ఎల్ఆర్ఎస్ స్కీంను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. అక్రమ లే అవుట్‌లో కనీసం ఒక్క ప్లాట్ అయినా గత జూన్ నెలాఖరు లోపల రిజిస్టర్ అయి ఉండాలన్నారు. ఈ సౌకర్యాన్ని ప్లాట్లు, లేఅవుట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

తాడిపత్రి రూరల్ : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని రావివెంకటాంపల్లి వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని మగవ్యక్తి రోడ్డుపై మృతి చెంది కనిపించాడు. రాత్రి సమయం కావడంతో ఏ వాహనం ఢీకొని మృతి చెందాడో తెలియలేదు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తాడిపత్రి రూరల్ పోలీసులు తెలిపారు.

వాసాపురంలో ట్రాక్టర్ చోరీ

యల్లనూరు : మండల పరిధిలోని వాసాపురం గ్రామంలో రైతు హరీష్‌కు చెందిన స్వరాజ్ ట్రాక్టర్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంటి వద్ద ఉన్న ఎపి 02, 2421 నెంబరు ట్రాక్టర్‌ను గుర్తు తెలియన వ్యక్తులు తీసుకెళ్లారు. ఉదయం గమణించిన బాధిత రైతు వెంటనే ఎస్ఐ రామాంజనేయరెడ్డికి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ కేసు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా ట్రైనీ ఎస్ఐ సురేష్ స్థానిక హిందూస్తాన్ పెట్రోల్ బంకులో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించారు.